„మహారాజా! నాశక్తినీ, ప్రతిభనూ నీ సేవలో వినియోగించాను. నాకొకటే కోరిక. రాజకుమారిని పరిణయం చేసుకోవాలి.”

దర్బారులోని సభికులంతా చేతనంలేని బొమ్మలయారు.

రాజు ఏమి చెపుతాడు!

రాజు చిరునవ్వునవ్వాడు.

„నీకోర్కె ఫలిస్తుంది. నారాజ్య ప్రజలందరి సమక్షంలోనూ, నీకు నా కుమార్తెనిచ్చి పరిణయం చెయ్యడానికి సంతోషంగా వొప్పుకుంటున్నాను. సిద్ధాంతులు ముహూర్తం నిర్ణయిస్తారు.

కాని-నా తరువాత నీవేరాజు. అప్పుడు, నేను కట్టించిన యీ దేవాలయంకంటె, యీ గోపురాలకంటె గొప్పగా నీవు దేవాలయాలన్నీ, గోపురాలనూ నిర్మించుకుంటావనే భయం నాకు ఎక్కువగా వుంది. అలా జరగకూడదు. దానికి ఒకటే ఉపాయంతోచింది నాకు. రేపు ఉదయం, నా భటులు నీ రెండు కనుగ్రుడ్లనూ పీకివేస్తారు” అంటూ లేచి సిద్ధాంతులవైపు తిరిగి, „నా కుమార్తె వివాహానికి ముహూర్తం నిర్ణయించండి” అని దర్బారు చాలించాడు రాజు.

# సగంమంది

ఊరంతా అట్టుడికినట్టు వుడికిపోతోంది. ఎవరినోటచూసినా, ఆ పత్రికను గురించిన మాటలే. ఇంతకూ సంగతి ఏమిటంటే, ఆ పత్రికా సంపాదకుడు, ఆ వారపు సంపాదకీయంలో “ఈ వూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలు” అని వ్రాశాడు. దానితో మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులకే కాక, వూరందరికీకూడా ఆ సంపాదకుడిమీద పట్టరానంత కోపం వచ్చింది.

సంపాదకుడు ఆ వూరివాడు కాడు. అది, అతని అత్తవారి వూరు. స్వగ్రామంలో చెలామణి కాలేక, అత్తవారి వూరికివచ్చి ఒక వారపత్రిక

పెట్టుకున్నాడు. ప్రతివారం ఎవళ్ళనో వొకళ్ళను తిట్టడం ఒక పాలిసీగా పెట్టుకున్నాడు. తిట్లుతిన్నవాడూ, ఆ సంగతి ఆ నోటా, ఆ నోటా విన్నవాడుకూడా ఆ పత్రిక కొని చదువుకోవడమే కాకుండా, పుత్తగోత్తరా ఎందుకైనా పనికి వొస్తుందని భద్రంగా దాచిపెట్టుకొనేవాడు. ఆవిధంగా, ఆ పత్రికకు చాలా చెల్లుబడి ఏర్పడింది. మొదట్లో, ఆ వూరివాళ్ళే చాలామంది ఆ పత్రికమీద అభిమానం చూపించారు. ఆ సంపాదకుడి దగ్గరకు వెళ్ళి, ఒకడిగుట్టు మరొకడు గోప్యంగా చెప్పి వచ్చేవాడు. చివరకు తన మీదగూడా ఒక వ్యాసం అచ్చు పడినతరువాత "ఛండాలపు గాడిద కొడుకు" అని ఆ సంపాదకుణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టేవాడు.

ప్రజలు మెచ్చుకున్నా, తిట్టుకున్నా ప్రతివారమూ ఆ పత్రిక వేలకువేలుగా అమ్ముడుపోతోంది. ప్రచారాన్నిబట్టి, ప్రకటనలు వస్తున్నాయి. కోలెడు డబ్బువచ్చి అతనివొళ్ళో పడుతోంది.

కాస్త బాగుపడుతున్న వాణ్ణిచూస్తే, పదిమందికీ కళ్ళల్లో కారం కొట్టుకున్నట్టు వుంటుంది. అంచేత, వూరందరూ సమయందొరికితే అతన్ని అధఃపాతాళలోకానికి త్రొక్కివెయ్యాలని వేచివున్నారు.

ఇప్పుడు దొరికింది సమయం. మునిసిపల్ కౌన్సిలు సభ్యుల్ని అతడు అంతమాట అన్న తరువాత, వాళ్ళంతా తలుచుకుంటే ఎంత పని అయినా చేస్తారు. ఒక కౌన్సిలరుయింటికి యింకొకడు చొప్పున అందరూ ఆరోజంతా కాళ్ళు కాలిన పిల్లులలాగ తిరుగుతూనే వున్నారు. వాళ్ళు అలా తిరగడం ప్రజలంతా చూస్తూనేవున్నారు. ఈ దెబ్బతో వీడి పని అయిందిరా అని చాలామంది ఆనందించారు.

మ్యునిసిపల్ కౌన్సిలర్లు అందరూకలిసి మాట్లాడుకొన్నారు. అక్కడనుంచి అంతా ఛైర్మనుయింటికి వెళ్ళారు. ఛైర్మనుతో చాలాసేపు మాట్లాడారు. ఛైర్మను, ప్రత్యేకం కబురు పంపించి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరును పిలిపించాడు.

అందరూ కలిసి ఎంతోసేపు తీవ్రమైన ఆలోచనచేశారు. తరువాత,

అందరూ వెళ్ళిపోయారు. ఛైర్మను, పోలీసు ఇన్‌స్పెక్టరూ కలసి ఆ సంపాదకుని యింటికి వెళ్ళారు. అతడు వారిద్దరినీ కూచోమన్నాడు. మర్యాద చేశాడు.

చిట్టచివరకు ఛైర్మను తాను వచ్చినపని చెప్పాడు. "మీ వ్యాసానికి మ్యునిసిపల్ కౌన్సిలర్లందరికీ చాలా కోపంగావుంది" అన్నాడు.

"నేను సగంమందిమీద వ్రాస్తే, అందరికీ ఎందుకండి కోపం ?" అని అడిగాడు సంపాదకుడు.

పోలీసు ఇన్‌స్పెక్టరు కొంచెం కలుగజేసుకొన్నాడు.

చిట్టచివరకు ఎలాగయితేనేం, వచ్చేవారపు సంచికలో సవరణ ప్రకటిస్తానని సంపాదకుడు వొప్పుకున్నాడు.

ఈ సంగతి వూరంతా ప్రాకింది. సవరణ ఏమనివేస్తాడో, తన తప్పును క్షమార్పణ ఎలా చెప్పుకుంటాడో అని ప్రతివాడూ ఎదురు చూస్తున్నాడు. వచ్చేవారపు సంచిక కోసం తహతహలాడుచున్నాడు.

చాలామంది ముందుగానే, ఏజెంట్లకు డబ్బుకట్టి తమ కాపీ రిజర్వు చేసుకున్నారు.

ఆ వారంరోజులూ, అదే ఆలోచనతో గడిపారు.

వారంరోజులు గడవడం ఎంతసేపు! మళ్ళీ వారం వొచ్చేసింది. మళ్ళీ పత్రిక వొచ్చేసింది.

అందరూ విరగబడి తలా వొకకాపీ కొనుక్కున్నారు.

సంపాదకీయం తీశారు. చదివారు.

"మనవూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలని గతవారం ప్రకటించాము. మాది పొరపాటు.

"మనవూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలుకారు!"